# రవీంద్ర గీతాంజలి

## అనువాదం:గాయత్రి



**(గతసంచిక నుంచి తరువాయి)**

***29***

**నా నామంతో**

పెనవేసుకున్నాడతను

అంధ కూపంలో రోదిస్తోన్నాడు

ప్రాకార నిర్మాణంలో

నే నిమగ్నమైనా

రోజురోజుకూ

ఆకసంలోకి పెరిగే కొద్దీ

గోడ చీకటి నీడలో

స్వస్వరూపం అగోచరం!

నా ప్రాకారం చూసుకుంటూ

నాకెంతో గర్వం

దుమ్ము, మట్టితో పూతలు పూస్తున్నా

లేకుంటే , ఈ పేరులో

చిన్ని కంత మిగిలిపోతుందేమోనని

జాగ్రత్తలతో నా రూపం మరుగవుతోంది!

***

*30*

**నా ఒంటరి ప్రణయ యాత్రలో**

ఈ నిశ్శబ్ద నిశీధిలో
నన్ననుసరిస్తున్నారెవరో?

వదిలించేందుకు పక్కకు జరిగినా
తప్పించుకోలేకున్నా
నా ప్రతి పలుకు పదానికీ
బిగ్గరగా సవ్వడి చేస్తున్నాడు

నా అంతరాత్మ
నా ప్రభువాతడు
బిడియం లేదతనికి
కాని, అతని తోడున నీగుమ్మం చేరడానికి
నాకే సిగ్గేస్తోంది!

***

*31*

**"బందీ! నిను బంధించిందెవ్వరు?"**

"నా ప్రభువు!" చెప్పాడు బందీ.

"లోకంలో అందరినీ మించిన భాగ్యం, శక్తీ నాదనుకొన్నా. ప్రభువు ధనాన్ని నా కోశాగారంలో దాచా. ప్రభువు శయ్యపై శయనించా నిదుర ముంచెత్తగా. మెలకువై చూస్తే నా ధనాగారంలో నే బందీనై యున్నా.."

"బందీ! విడదీయలేని ఈ సంకెళ్ళు వేసిందెవరు?"

"జాగ్రత్తగా సంకెళ్ళు వేసుకొంది నేనే" బందీ సమాధానం.
"నా అజేయ శక్తి ప్రపంచాన్ని బంధించి నన్ను స్వతంత్రునిగా చేస్తుందనుకున్నా. దివారాత్రాలు శ్రమించి, అఖండ జ్వాలలతో, సమ్మెట పోట్ల కాఠిన్యంతో సంకెళ్ళు తయారయ్యే సరికే అవి నన్ను తమ గుప్పిట బిగించాయి.."

***

*32*

**లోకంలో నన్ను ప్రేమించేవారంతా**
ఎలాగైనా బంధించాలని చూస్తారు
కానీ, వారిని మించిన నీ ప్రేమ
నను స్వతంత్రునిగా చేసింది

మరచిపోతానని వారు
నను ఒంటరిగా వెళ్ళనివ్వరు
రోజులు గడచిపోతున్నాయి
కానీ, నీవు కానరాలేదు.

ప్రార్థనగా నిను పిలువకున్నా
హృదయంలో దాచుకోకున్నా
ప్రేమ ప్రేమకై వేచియుంటోంది

***

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

POST YOUR COMMENTS